ప్రజా సంక్షేమమే వైఎస్సార్‌సీపీ అజెండా


తాడిపత్రిలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి


యాడికిలో ముస్లింల ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రిరూరల్: ప్రజా సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ప్రధాన అజెండాగా ప్రచారంలో దూసుకుపోతున్నామని ఎమ్మెల్యే పెద్దారెడ్డి తెలిపారు. పట్టణంలోని టైలర్స్ కాలనీలో గురువారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మొదట కాలనీలోని దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.అనంతరం కాలనీలో ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ప్రజలను కోరారు. ప్రజారంజక పాలన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో సాధ్యమన్నారు. ఐదేళ్ల కాలం జరిగిన సంక్షేమం 40 ఏళ్ల టీడీపీ చరిత్రలో జరగలేదన్నారు. బూటకపు మాటలతో టీడీపీ నాయకులు మభ్యపెడుతూ ఓట్లు వేయించుకోవాలని చూస్తున్నారన్నారు. వారి మాటలకు మోసపోకుండా వైఎస్సార్‌సీపీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు.

జన సునామీలో టీడీపీ అభ్యర్థుల గల్లంతు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సిద్ధం సభలు, బస్సుయాత్రకు వచ్చిన జన సునామీని చూస్తుంటే ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులు అడ్రస్ గల్లంతు కావడం ఖాయమని ఎమ్మెల్యే పెద్దారెడ్డి అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం పెద్దపప్పూరు మండలం గార్లదిన్నెకు చెందిన పలువురు నాయకులు ఎమ్మెల్యే సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. హరిచంద్రారెడ్డి, నీలపు రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, నారాయణరెడ్డి తదితరులు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నామినేషన్ సందర్భంగా బుధవారం దాదాపు 15 వేల మందికి పైగా తాడిపత్రి నియోజక వర్గం నుంచి తరలి రావడం ఆశ్చర్యం కలిగించిందన్నారు. జేసీ ప్రభాకర్‌రెడ్డిపైన ఉన్న అసంతృప్తి, వైఎస్సార్‌సీపీపై ఉన్న అభిమానంతో రెట్టించిన ఉత్సాహంతో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు తరలి వచ్చారన్నారు. జేసీకి మరోసారి ఓటమి తప్పదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ఉన్న అపార నమ్మకం, తాడిపత్రిలో ప్రశాంతత జీవనం కోసం ప్రజలు వైఎస్సార్‌సీపీకి ఓటు వేయడానికి సిద్ధంగా ఉన్నారన్నారు.

10 కుటుంబాలు టీడీపీ వీడి వైఎస్సార్‌సీపీలోకి..

తాడిపత్రిటౌన్: మండలంలోని ఊరిచింతల గ్రామంలో 20 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరాయి. గురువారం ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి గ్రామానికి వెళ్లి వారికి పార్టీ కండువాలు కప్పి వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించారు. గ్రామానికి చెందిన శీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రమణ, గురప్ప, పెద్దులు, నాగరాజు, పుల్లయ్య, ఆది, తిరుపతి, నాగభూషణ, శివయ్య, బొమ్మి కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. సీఎం జగన్ సంక్షేమ పథకాలు, గ్రామాల్లో ఎమ్మెల్యే చేపట్టిన అభివృద్ధి పనులు నచ్చి వైఎస్సార్‌సీపీలో చేరినట్లు వారు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో కేతిరెడ్డి పెద్దారెడ్డి విజయానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ రాజు, రామేశ్వరరెడ్డి, పల్లె నాగేశ్వరరెడ్డి, విజయ్‌కాంత్‌రెడ్డి, హనుమంతరెడ్డి, సంజీవరెడ్డి, హరినాథరెడ్డి, ఆదిశంకర్‌గౌడ్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.


తాడిపత్రి దర్గాలో ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే


పెద్దపప్పూరు మండలం గార్లదిన్నెవాసులకు పార్టీ కండువా కప్పుతున్న ఎమ్మెల్యే పెద్దారెడ్డి


వైఎస్సార్‌సీపీలో చేరిన ఊరిచింతల గ్రామస్తులు

విజయమే లక్ష్యంగా పనిచేయండి

యాడికి: వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా పనిచేయాలని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలోని నారాయణ స్వామి కాలనీలో 200 కుటుంబాలకు చెందిన ముస్లిం మైనార్టీలు నిర్వహించిన ఆత్మీయ సమీవేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గత 35 ఏళ్లుగా ఎంపీ, ఎమ్మెల్యేగా పదవులు అనుభవించిన జేసీ సోదరులు చేయలేని అభివృద్ధిని, ఐదు సంవత్సరాల్లోనే యాడికి మండలాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసిన ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డికి మద్దతు ఇస్తున్నామన్నారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి మరోసారి ఎమ్మెల్యేగా కేతిరెడ్డి పెద్దారెడ్డిని, అనంతపురం ఎంపీగా శంకర్ నారాయణను గెలిపించుకుంటామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో దుష్ట చతుష్టయంతో యుద్ధానికి సిద్ధం కావాలన్నారు. సీఎం జగన్‌ను గద్దె దింపడమే లక్ష్యంగా టీడీపీ, బీజేపీ, జనసేన కుట్ర పూరిత రాజ కీయాలు చేస్తున్నాయని మండిపడ్డారు. ప్రతి పక్షాల మైండ్ గేమ్‌లో భాగంగా ప్రభుత్వంపై వారి అనుకూల పత్రికలు, మీడియా దుష్ప్రచారం చేస్తున్నాయన్నారు. వారెన్ని కుట్రలు చేసినా ప్రజలు వైఎస్సార్‌సీపీ వైపే ఉన్నారన్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్‌కు ఓటమి తప్పదన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు, జెడ్పీ మాజీ సభ్యుడు వెంకటరామిరెడ్డి, యాడికి ఉప సర్పంచు కాసా చంద్రమోహన్, సీనియర్ నాయకులు బాలా రమేష్ బాబు, భోగాతి బ్రహ్మానందరెడ్డి, ముస్లింలు షాషావలి, ఎస్ఎం భాషా, ఫజల్, కార్పెంటర్ భాష, అలీ, షుకూర్ ఫరూక్ తదితరులు పాల్గొన్నారు.

పేదింటి బిడ్డను ఆదరించండి


సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజనేయులు


రేగడి కొత్తూరులో భారీ జన సందోహంతో వీరా, ఆలూరు సాంబశివారెడ్డి

- ఎగతాళి చేసిన చంద్రబాబుకు బుద్ధి చెప్పండి
- ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజనేయులు

బుక్కరాయసముద్రం: ముఖ్య మంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదింటి బిడ్డకు టికెట్ కేటాయించారని, ప్రజలు తనను ఆదరించాలని శింగనమల నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజనేయులు కోరారు. గురువారం మండలంలోని రేగడి కొత్తూరు, పొడరాళ్ల, వడియంపేట, బాట్లో కొత్తపల్లి గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డితో కలసి ఆయన మన ఊరికి మన వీరా కార్యక్రమంలో భాగంగా ప్రచారం నిర్వహించారు. ముందుగా రేగడి కొత్తూరు గ్రామంలో ఉదయం 7.30 గంటల నుంచి వీరాంజనేయులు ప్రచారం ప్రారంభించారు. ఆయా గ్రామాల్లోకి ఆయనకు వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామస్తులు భారీగా స్వాగతం పలికారు. నాయకులు ఫుల్ జోష్‌తో ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజినేయులకు మద్దతుగా ప్రచారంలో పాల్గొన్నారు. అదే విధంగా గ్రామాల్లో వీరాంజనేయులు వృద్ధులను ఆప్యాయంగా పలకరిస్తూ ఇంటింటికీ వెళ్లి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను వివరించారు

ఎగతాళి చేసిన వారికి బుద్ధి చెప్పండి

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు ఎమ్మెల్యే టిక్కెట్ ఇస్తే చంద్రబాబు నాయుడు ఎగతాళి చేశారన్నారు. రాజ్యాధికారంలో ఎల్ల కాలం పెత్తందార్లే ఉండాలా...పేదలు ఉండకూడదా.. అని సీఎం జగనన్న పేదలకు టిక్కెట్ ఇస్తే అదే చంద్రబాబు కోటీశ్వర్లుకు, బడా పారిశ్రామిక వేత్తలకు టిక్కెట్లును అమ్ముకున్నారన్నారు. చంద్రబాబుకు పేదలంటే చులకనా బావం ఉందన్నారు. దళితుడు అని చూడకుండా టిప్పర్ డ్రైవర్ అంటూ ఎగతాళి చేశాడన్నారు. ఎగతాళి చేసిన చంద్రబాబుకు ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. సంక్షేమ పథకాలతో సీఎం జగనన్న చరిత్రలో నిలిచిపోయే పాలన అదించారన్నారు. జగనన్న చేపట్టిన పథకాల వల్లే రాష్ట్రంలో మళ్లీ అధికారం చేపట్టబోతున్నామని ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజినేయులు తెలిపారు. కులమతాలు, వర్గాలు, పార్టీలకు అతీతంగా జగనన్న పథకాలు అందాయన్నారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎంపీగా శంకరనారాయణను, ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. నియోజక వర్గ ప్రజలకు అందుబాటులో ఉండి అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే జగన్‌ను మళ్లీ సీఎం చేసుకుందామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ భాస్కర్, పార్టీ మండల కన్వీనర్ అంకే నరేష్, సొసైటీ అధ్యక్షుడు వెంకటరెడ్డి, వైస్ ఎంపీపీ రామగోపాల్, సర్పంచులు ఎర్రిస్వామి, నారాయణమ్మ, ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, నాయకులు ఆలూరి రమణారెడ్డి, గువ్వల రాజశేఖర్‌రెడ్డి, అనంత వెంకటరెడ్డి, నాగలింగారెడ్డి, అప్పిరెడ్డి, సుబ్బ రాయుడు, నాగిరెడ్డి, రాధా మనోహర్‌రెడ్డి, ముసలన్న, సుబ్బారెడ్డి, తిరుపాలు, చంద్రమోహన్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, సాకే నారాయణస్వామి, చికెన్ నారాయణస్వామి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నేడు వీరా ఎన్నికల ప్రచారం

పుట్లూరు: మండలంలోని కడవకల్లు, సంజీవపురం, ఓబుళాపురం, దోసలేడు, చెర్లోపల్లి గ్రామాల్లో శుక్రవారం 'మన ఊరికి మన వీరా' కార్యక్రమంలో భాగంగా ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నాగేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో శింగనమల ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.వీరాంజనేయులు పాల్గొంటారని, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని ఆయన కోరారు.


ఓటు అభ్యర్థిస్తున్న వీరాంజనేయులు

వైఎస్సార్‌సీపీలోకి ఉప సర్పంచ్

శింగనమల: మండలంలోని చక్రాయిపేట ఉప సర్పంచ్, బండమీదపల్లి గ్రామానికి చెందిన గోగుల పెద్ద బాల సంజీవరాయుడును టీడీపీ నాయకులు మాయమాటలు చెప్పి చేర్చుకున్నారు. తిరిగి గురువారం ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి ఆధ్వర్యంలో ఉప సర్పంచ్‌తో పాటు వారి అనుచరులకు వైఎస్సార్‌సీపీ నాయకులు శెట్టిపల్లి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. పార్టీలోకి చిన్న బాల సంజీవరాయుడు, రామాంజనేయులు, ఆదెప్ప, వీరాంజనేయులు, నాగేంద్ర, డేరంగుల రామాంజనేయులు, రవి, పరుశురాముడు చేరారు. కార్యక్రమంలో డీసీసీఎంఎస్ డైరెక్టర్ బొమ్మన శ్రీరామిరెడ్డి, మాజీ సర్పంచ్ వెంకటప్ప, మునేంద్ర తదితరులు పాల్గొన్నారు.


సంజీవరాయుడును పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఆలూరు సాంబశివారెడ్డి

క్లుప్తంగా

పరామర్శ


రైతులతో మాట్లాడుతున్న కేతిరెడ్డి హర్షవర్ధన్ రెడ్డి

పెద్దపప్పూరు: మండలంలోని వరదాయపల్లిలో ముగ్గురు రైతులను తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తనయుడు కేతిరెడ్డి హర్షవర్ధన్ రెడ్డి పరామర్శించారు. బుధవారం చోటుచేసుకున్న విద్యుత్ ప్రమాదంలో గిరితో పాటు మరో ఇద్దరు రైతులకు చెందిన మొక్కజొన్న, అరటిపంట దగ్ధమైన విషయం విదితమే. గురువారం కేతిరెడ్డి హర్షవర్ధన్ రెడ్డి సంఘటనా స్థలాన్ని సందర్శించారు. రూ.8లక్షలకు పైగా నష్టం వాటిల్లిందని బాధితులు వాపోయారు. ప్రభుత్వం ద్వారా నష్ట పరిహారం కృషి చేస్తామని రైతులకు ఆయన భరోసా ఇచ్చారు.ఆయన వెంట సర్పంచు వెంకటరాముడు, శివారెడ్డి, పార్టీ మండల కన్వీనర్ అమర్‌నాథ రెడ్డి, అమ్మలదిన్నె రామచంద్రారెడ్డి తదితరులున్నారు.

పెద్దారెడ్డిని మరోసారి గెలిపించండి


ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి కోడలు మౌనికారెడ్డి

తాడిపత్రిటౌన్: ఫ్యాను గుర్తుకు ఓటు వేసి కేతిరెడ్డి పెద్దారెడ్డిని మరోసారి గెలిపించాలని ఆయన కోడలు మౌనికారెడ్డి కోరారు. మండలంలోని గన్నెవారిపల్లికాలనీలో ఆమె ఇంటింటికి వెళ్లి ఫ్యాను గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రమణమ్మ, ఎంపీటీసీ రవి, నాయకులు ప్రదీప్‌రెడ్డి, పుల్లారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, శివ, చింబిలిబాజ్జీ, మధు, కాకర్ల పెద్దనాయుడు, నరేష్, జయసింహ, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే సంక్షేమం

యాడికి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సంక్షేమ పాలన సాధ్యమని వైఎస్సార్‌సీపీ నాయకులు తలారీ నాగేష్, చితంబర నాయుడు అన్నారు. గురువారం మండలంలోని రామరాజుపల్లెలో వారు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. జగనన్న పాలనలో చేకూరిన లబ్ధిని గుర్తించి ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుకు ఓటెయ్యాలన్నారు. కార్యక్రమంలో రాయలచెరువు ఉప సర్పంచు ప్రవీణ్‌కుమార్ యాదవ్, నాయకులు జిలాన్, జగదీస్ చౌదరి, రవికాంత్ చౌదరి, నాగేంద్రగౌడ్, రంగనాయకులు రెడ్డి, మల్లికార్జున పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీకి ఓటు వేయండి


సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే పెద్దారెడ్డి సతీమణి రమాదేవి


ఓటు అడుగుతున్న ఎమ్మెల్యే కోడలు సాయి అర్చితరెడ్డి

తాడిపత్రిరూరల్: ఎమ్మెల్యే పెద్దారెడ్డి గెలుపు కోసం ఆయన సతీమణి, కోడలు వేర్వేరుగా ప్రచారం చేశారు. పట్టణంలోని శ్రీరాములపేటలో ఎమ్మెల్యే సతీమణి రమాదేవి, పాతకోటలో కోడలు సాయి అర్చితరెడ్డి ప్రచారంలో పాల్గొన్నారు. వారు ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీకి ఓటు వేయాలని కోరారు. తాడిపత్రిలో జరిగిన అభివృద్ధి, సంక్షేమం వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమైందన్నారు. ఎమ్మెల్యే పెద్దారెడ్డి తాడిపత్రిలో ప్రశాంత వాతావరణ ఉండేందుకు కృషి చేశారని ప్రజలకు వివరించారు.

తాడిపత్రిలో 43, శింగనమలలో 30 నామినేషన్లు

తాడిపత్రి: తాడిపత్రి అసెంబ్లీ నియోజకవర్గంలో బరిలో నిల్చున్న అభ్యర్థుల నుంచి ఆఖరి రోజైన గురువారం నాటికి మొత్తం 43 నామినేషన్లను వివిధ పార్టీలకు చెందిన అభ్యర్థులు సమర్పించినట్లు ఆర్ఓ రాంభూపాల్ రెడ్డి తెలిపారు. ఈ నెల 18 నుండి ప్రారంభమైన నామినేషన్ల పర్వం గురువారం ముగిసింది. ఆఖరి రోజు 18 నామినేషన్లను పలు పార్టీలకు చెందిన అభ్యర్థులు దాఖలు చేశారు. వారిలో వైఎస్సార్‌సీపీ నుంచి కేతిరెడ్డి రమాదేవి, కేతిరెడ్డి పెద్దారెడ్డి తరపున వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పేరం స్వర్ణలత, ఇతర నాయకులతో కలసి నామినేషన్ దాఖలు చేశారు. టీడీపీ నుంచి జేసీ ప్రభాకర్‌రెడ్డి, కుమారుడు జేసీ అస్మిత్‌రెడ్డి రెండు సెట్లు నామినేషన్ దాఖలు చేశారు. బీసీవై పార్టీ తరపున బి.డాకరాజు, సమాజ్‌వాది పార్టీ తరపున ఎ.దూదేకుల మహబూబ్‌బాషా, జై భారత్ నేషనల్ పార్టీ తరపునన పి.నీలకంఠ ఆచారి, రాష్ట్రీయ సమాజ్ దళ్ పార్టీ తరపున ఎస్. సాయిరామ్‌రెడ్డి నామినేషన్ వేశారు. అలాగే ఇండిపెండెంట్ అభ్యర్థులుగా ఎల్.పెద్దిరెడ్డి, ఎం.నారాయణస్వామి, బి.రాజగోపాల్, ఆర్.నరసింహులు, ఎస్.కంబగిరి రాముడు, పి. సోమశేఖర్‌నాయుడు, జి. శివరామిరెడ్డి, పి. వినోద్‌కుమార్‌రెడ్డి నామినేషన్లను దాఖలు చేశారు.


ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తరపున నామినేషన్ అందజేస్తున్న పార్టీ రాష్ట్ర కార్యదర్శి పేరం స్వర్ణలత

శింగనమలలో 12..

శింగనమల : శింగనమల నియోజకవర్గానికి గురువారం 12 సెట్లు నామినేషన్ దాఖాలు చేసినట్లు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెన్నెల శ్రీను తెలిపారు. కాంగ్రెస్ తరపున సాకే శైలజానాథ్, టీడీపీ తరపున బండారు శ్రావణి రెండు సెట్లు, బండారు సాయిపవన్‌కుమార్, జయ మహాభారత్ పార్టీ తరపున సాకే శ్రీదేవి, ఇండిపెండెంట్లుగా కాయల రాంమోహన్, వంగా రవి, గట్టు రామాంజనేయులు, మిద్దె నల్లప్ప, శంకర్, వెట్టి ప్రకాష్,డి. రవిరాజ్ నామినేషన్లు వేశారు. కాగా మొత్తం 30 నామినేషన్లు దాఖలైనట్లు ఆర్ఓ తెలిపారు.

ఎమ్మెల్యే కేతిరెడ్డికి పట్టం కట్టండి


ఓటు అభ్యర్థిస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌రెడ్డి

తాడిపత్రి: వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కేతిరెడ్డి పెద్దారెడ్డికి మరో మారు ఎమ్మెల్యేగా పట్టం కట్టాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌రెడ్డి కోరారు. గురువారం ఆయన పట్టణంలోని 16వ వార్డులో ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి, ఎంపీగా శంకర్‌నారాయణ, ఎమ్మెల్యేగా కేతిరెడ్డి పెద్దారెడ్డిని గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీని గెలిపించండి


భీమునిపల్లిలో ప్రచారం చేస్తున్న కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి

పెద్దవడుగూరు: ప్రజలకు సంక్షేమ పథకాలు పూర్తి స్థాయిలో అందించిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కి ప్రజలే తోడుగా నిలవాలని తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి కుమారులు హర్షవర్ధన్‌రెడ్డి, కేతిరెడ్డి సాయిప్రతాప్‌రెడ్డి కోరారు. గురువారం మండలంలోని భీమునిపల్లి, రావులుడికి, కోనాపురం, చింతలచెరువు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రజలు ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, ఎంపీటీసీ లు, సర్పంచులు, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

గార్లదిన్నె: ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో గార్లదిన్నె పోలీసులు వాహనాలు తనిఖీలు ముమ్మరం చేశారు. గురువారం కల్లూరు వద్ద 44వ జాతీయ రహదారిపై పోలీసులు ప్రతి వాహనాన్నీ క్షుణ్ణంగా తనిఖీ చేసి పంపించారు.

ప్రచారంలో సంయమనం పాటించండి


డీఎస్పీ గంగయ్య

తాడిపత్రిరూరల్: ఎన్నికల ప్రచారంలో వివిధ పార్టీల అభ్యర్థులు, నాయకులు, అనుచరులు కోపతాపాలు వీడి సంయమనం పాటించాలని డీఎస్పీ గంగయ్య సూచించారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి అభ్యర్థులు సహకరించాలన్నారు. ప్రచారాలపై ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వడం వల్ల పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడానికి వీలుంటుందన్నారు. ఎన్నికలను దృష్టిలో వుంచుకొని నియోజక వర్గంలో 59 అత్యంత సమస్మాత్మక గ్రామాలను గుర్తించామన్నారు. మొత్తం 274 పోలింగ్ కేంద్రాల్లో 136 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా గుర్తించామన్నారు. ఆయా గ్రామాల్లో సీఐలు, ఎస్ఐలు, స్పెషల్ పార్టీ సిబ్బంది ఆకస్మిక తనిఖీలు చేస్తున్నారన్నారు. ఫ్లాగ్ మార్చ్, రూట్ మార్చ్, వాహనాల తనిఖీలను చేస్తూ ప్రజలు నిర్భయంగా ఓటు వేసేలా చైతన్య పరుస్తున్నామన్నారు. తాడిపత్రి పట్టణంతోపాటు గ్రామాల్లో అనుమానస్పందగా సంచరించే వారి వివరాలను ప్రజలు సమాచారం అందించి ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడాలని కోరారు. మొత్తం 540మందికి పైగా రౌడీ షీటర్లుండగా వారిలో 480 మందిని పైగా తహసీల్దార్‌ల ఎదుట బైండోవర్ చేశామన్నారు. నియోజక వర్గంలో గతంలో జరిగిన పలు ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని దాదాపు 300 మందిని సమస్యలు సృష్టించేవారిగా గుర్తించామన్నారు. వారందరిని ఆయా పోలీసు స్టేషన్‌లకు పిలిపించి ఎన్నికలు ప్రశాంతంగా జరిగేవిధంగా సహకరించాలని కౌన్సెలింగ్ ఇచ్చామన్నారు. మొత్తం 148 మందికి గన్ లైసెన్స్‌లున్నాయని, అందులో 165 తుపాకులకు గాను 152 స్వాధీనం చేసుకున్నామని, 11 డిపాజిట్ చేశారని, రెండు తుపాకులను లైసెన్సు దారులు విక్రయించారన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో ప్రతిభ


సాయి హనీష్‌రెడ్డి

తాడిపత్రి అర్బన్: జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో తాడిపత్రికి చెందిన కె.సాయి హనీష్‌రెడ్డి ప్రతిభను చాటాడు. పట్టణంలోని జయనగర్‌కాలనీకి చెందిన కె.కిషోర్‌కుమార్‌రెడ్డి, కె.సునీత దంపతుల కుమారుడు కె.సాయి హనీష్‌రెడ్డి ఆల్‌ఇండియా 588వ ర్యాంకు సాధించాడు. అతడిని పలువురు అభినందించారు.

ఘనంగా ఉరుసు

పెద్దవడుగూరు: మండలంలోని లక్ష్మంపల్లిలో రెండు రోజులుగా జరుగుతున్న పక్కీరప్పస్వామి ఉరుసు గురువారం ఘనంగా ముగిసింది. ఉదయం నుంచి దర్గాలో భక్తులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సాయంత్రం మహిళలు చక్కెర చదివించారు. దర్గా మత పెద్దలు, గ్రామపెద్దలు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

ఉపాధి పనుల తనిఖీ

పుట్లూరు: మండలంలోని అరకటివేముల, కడవకల్లులో జరుగుతున్న ఉపాధి హామీ పనులను గురువారం ఎంపీడీఓ దస్తగిరి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో పని ప్రదేశాల్లో కూలీల మస్టర్లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వేసవిలో ఉదయాన్నే పనులకు హాజరై త్వరితగతిన నిర్ణీత కొలతల్లో పనులు చేసుకోవాలన్నారు. వడదెబ్బకు గురికాకుండా నీడ ఏర్పాటు చేసుకోవాలన్నారు. అనంతరం కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేశారు. ఈయన వెంట ఉపాధి సిబ్బంది ఉన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరగాలి

పెద్దవడుగూరు: సమస్యాత్మక గ్రామాల్లో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని యాడికి రూరల్ సర్కిల్ సీఐ రోషన్, ఎస్ఐ శ్రీనివాసులు సూచించారు. గురువారం మండల పరిధిలోని అప్పేచర్ల, క్రిష్టిపాడు తదితర గ్రామాల్లో కేంద్ర బలగాలతో పోలీసులు కవాతు నిర్వహించారు ఓటర్లను ఎవరైనా ప్రభావితం చేస్తే సహించబోమని హెచ్చరించారు.

సంక్షిప్త సమాచారం

ప్రశాంతంగా ఓటుహక్కు వినియోగించుకోండి

యల్లనూరు: ఓటుహక్కును ప్రశాంతంగా వినియోగించుకోవాలని ఎస్ఐ గిరిబాబు సూచించారు. గురువారం ఎస్ఐ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా ఓటుహక్కును వినియోగించుకోవాలన్నారు. ఎవరైనా బలవంతం చేసి ఫలానా పార్టీకి ఓటు వేయాలని సూచించినా, ప్రలోభపెట్టినా ఫిర్యాదు చేయచ్చన్నారు. ఎక్కడైనా శాంతిభద్రలకు విఘాతం కల్గిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవ్వరైనా ఓటర్లను ఇబ్బందులకు గురి చేస్తే జైలుకు పంపుతామన్నారు.

విద్యార్థినికి అభినందన

పుట్లూరు: మండలంలోని గోపురాజుపల్లికి చెందిన విద్యార్థిని సాయి కీర్తనను ఎంఈఓ శ్రీదేవి, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ ఓబుళరెడ్డి గురువారం అభినందించారు. ఇటీవల విడుదైన పదోతరగతి ఫలితాల్లో ఆదర్శ పాఠశాల విద్యార్థిని 579 మార్కులు సాధించింది. వారు ఆ గ్రామానికి వెళ్లి విద్యార్థినిని అభినిందించారు.

టీడీపీ ప్రచారంలో అపశ్రుతి

శింగనమల: శింగనమలలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బండారు శ్రావణి నామినేషన్ కార్యక్రమంలో ట్రాక్టర్ బోల్తా పడిన ప్రమాదంలో టీడీపీ కార్యకర్తలు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. నామినేషన్ సందర్భంగా టీడీపీ కార్యకర్తలు ట్రాక్టరుతో జీరో కట్ కొడుతుండగా, ట్రాక్టర్ బోల్తా పడింది. లో ట్రాక్టర్‌లో ఉన్న ముగ్గురు టీడీపీ కార్యకర్తలు చిన్న గాయలతో బయటపడ్డారు.

కమనీయం కోదండరాముని కల్యాణం

తాడిపత్రి అర్బన్: పట్టణంలోని ఏడిగడ్డ ఆంజనేయస్వామి ఆలయంలో శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా ఆఖరి రోజు గురువారం కోదండరాముని కల్యాణం నిర్వహించారు. ఉదయం 11గంటలకు ఎదుర్కోలు ఉత్సవాన్ని సంప్రదాయబద్ధంగా చేపట్టారు. సీతారాముల ఉత్సవ విగ్రహాలు నూతన వస్త్రాలతో ఉభయందార్లు బహూకరించిన యజ్ఞోపవీతం, ఆభరణాలు, పుష్పాలతో అలంకరించిన పల్లకిలో ప్రధాన ఆలయం నుంచి మంగళవాయిద్యాలతో కల్యాణ వేదిక వరకూ భక్తుల జయజయధ్వానాల మధ్య ఊరేగింపుగా తీసుకొచ్చారు. ప్రధాన అర్చకుల పర్యవేక్షణలో మధ్యాహ్నం 1 గంటకు సీతారాముల విగ్రహాలను ఎదురెదురుగా కూర్చోబెట్టి కల్యాణాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం 6గంటలకు సీతారాములను ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిలో కూర్చోబెట్టి మేళతాళాల మధ్య ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు సీతారాములను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.


అలంకరణలో సీతారాములు

ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలి

బుక్కరాయసముద్రం/పుట్లూరు/యల్లనూరు/గార్లదిన్నె/ పెద్దవడుగూరు: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు వ్యక్తి గత పరిశుభ్రత తప్పక పాటించాలని వైద్యులు సూచించారు. గురువారం ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవాన్ని బుక్కరాయసముద్రం, పుట్లూరు, యల్లనూరు, గార్లదిన్నె, పెద్దవడుగూరు మండలాల్లో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పీహెచ్‌సీ వైద్యులు సిబ్బందితో కలసి ర్యాలీ నిర్వహించారు. వైద్యులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్య పరి రక్షణపై జాగ్రత్తలు పాటించాలన్నారు. నీరు ఎక్కువగా తీసుకోవాలన్నారు. అనంతరం మలేరియా వ్యాధి నివారణ, వ్యాధి లక్షణాలు, నిర్మూలనపై అవగాహన కల్పించారు.